"ఏంటి కృష్ణమూర్తీ! ఎటు బయలుదేరావు? సినిమాకా, క్రికెట్ మ్యాచ్ ఏమైనా ఉందా?'' అన్నాడు రామారావు గంట పర్మిషన్ తీసుకుని ఫైల్స్ సర్దుకుని బయలుదేరబోతున్న కృష్ణమూర్తితో.

"అంత సీనేం లేదులే! అయితే కాస్త త్వరగా వెళ్ళాలి. అర్జెంట్ పని ఉంది'' అన్నాడు కృష్ణమూర్తి.

"ఏంటో అంత అర్జెంట్ పని? కొంపతీసి ఇంకేమైనా కొత్త బిజినెస్ గానీ చిట్‌ఫండ్‌లాంటిది గానీ మొదలుపెట్టావా?'' అడిగాడు.

"అవును. రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో భాగస్వామ్యం తీసుకున్నాను. ఇప్పుడు ఈ దగ్గర్లో స్టీల్ ప్లాంట్ వస్తున్నది కదా! స్థలాల రేట్లు విపరీతంగా పెరగనున్నాయి. ఇప్పుడు పెట్టుబడి పెట్టి ఎకరం లెక్కన కొంటే తర్వాత ప్లాట్స్ చేసి అమ్మితే బోలెడంత లాభాలు'' అన్నాడు కృష్ణమూర్తి.

"ఒరే కృష్ణమూర్తీ! నీకెందుకురా ఇంకా లేనిపోని తాపత్రయం. ఉన్నదానితో తృప్తిపడి బ్రతకడం నేర్చుకో. రెండుమూడుసార్లు దెబ్బతిన్నావు కూడా. ఈ వ్యాపారాలు వైకుంఠపాళిలాంటివిరా. వేగంగా పైకి పోవడానికి ప్రయత్నిస్తే క్రిందకి జారిపోయే ప్రమాదం కూడా పొంచి ఉంటుంది. అందుకే నా మాట విని ఇలాంటివన్నీ మానుకో''

"హు. చాలు నీ ఉపదేశాలు. లేకపోతే ఈ బెత్తెడు గొర్రెతోక జీతానికి జీవితంలో సుఖపడేదెప్పుడు? కన్న కలలు ఫలించేదెప్పుడు? అయినా నీకు చెప్పడం నావల్లకాదు'' అన్నాడు కృష్ణమూర్తి బయటకి వెళ్తూ. అతను వెళ్లిన వైపే చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చాడు రామారావు.

వీరిద్దరూ ఒకేచోట చిన్నప్పటినుంచీ కలిసి చదువుకుని, ఉన్న ఊరిలో ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడి ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు.

రామారావు తన జీతంతో ఆనందంగా, సంతృప్తిగా గడుపుతూ తీరిక సమయాల్లో పత్రికల్లో కథలు రాస్తూ, ఇతరత్రా సేవచేస్తూ సరదాగా జీవితం గడుపుతున్నాడు.

# అగాధం



-డి.వి.డి.ప్రసాద్

కృష్ణమూర్తి అందుకు పూర్తి విరుద్ధం. అతనికి లభించిన దానితో తృప్తిపడే నైజం లేదెప్పుడూ. భారీగా కట్నం తీసుకుని మరీ పెళ్ళిచేసుకున్నాడు. ఉద్యోగమే కాక అతనికి ఇతరత్రా ఆర్జించిపెట్టే సైడ్ బిజినెస్‌లు ఎన్నో ఉన్నాయి.

అయితే అతని కలలు సామాన్యమైనవి కావు. అడ్డదారిలో, అతి తక్కువ సమయంలో డబ్బు సంపాదించి సకల సౌభాగ్యాలు అనుభవించాలన్నది అతని లక్ష్యం. వస్తువుల మార్కెటింగ్‌తో పాటూ నెట్‌వర్కింగ్, ఆ తర్వాత షేర్ బిజినెస్‌లో కూడా అడుగుపెట్టాడు. అప్పట్లో సమయం అనుకూలించక లాభాలు ఆర్జించి పెట్టిన షేర్ బిజినెస్ అగాధంలోకి నెట్టింది. కొన్నాళ్ళు ఊరుకున్నాక అలుపెరగక మళ్లీ తన సొంత కార్యక్రమాలు ప్రారంభించాడు. ఆర్థికంగా స్థిరపడ్డాడు. మళ్లీ అన్నీ అమర్చుకుని సుఖప్రదమైన జీవితం గడుపుతున్నా ధన దాహం మాత్రం తీరలేదు. ఇప్పుడు మళ్లీ రియల్ ఎస్టేట్ వ్యాపారం వైపు ఆసక్తి చూపించాడు. కృష్ణమూర్తి ఆలోచన విన్న రామారావు అతన్ని మార్చడం తన వల్ల కాదని, అతన్ని రక్షించమని దేవుడ్ని ప్రార్థించడం తప్ప ఏమీ చేయలేకపోయాడు.

ప్రస్తుతం పట్టణానికి దగ్గరగా ఉన్న కొన్ని ప్రదేశాల్లో స్థలసేకరణ మొదలుపెట్టింది ఓ పేరు మోసిన కంపెనీ. రాజకీయనాయకులు తమ పలుకుబడితో అక్కడ స్టీల్‌కర్మాగారం వచ్చేట్టు చేసినా, అక్కడ పర్యావరణ రక్షణ సంస్థలు ఆందోళనకు దిగుతున్నా రాష్ట్రప్రభుత్వం అక్కడే ఉక్కుకర్మాగారం నిర్మించాలని దృఢనిశ్చయంతో ఉంది.

ఆ స్టీల్‌ప్లాంట్ చుట్టుపక్కల ఉన్న స్థలాల్ని కొని ఫ్లాట్స్, డూప్లెక్స్ ఇళ్ళు కట్టాలని సంకల్పించాయి రియల్ ఎస్టేట్ కంపెనీలు. ఈ అపూర్వ అవకాశం సద్వినియోగం చేసుకుని తరగని లాభాలు ఆర్జించాలని కృష్ణమూర్తి తపన. మళ్లీ రకరకాల లోన్లు పెట్టి, ప్రావిడెంట్ ఫండ్ నుంచి డబ్బులు, ఇతరత్రా అప్పులు తీసుకుని ఈ వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టాడు. అతను అనుకున్నట్టుగానే లాభాలు రాసాగాయి. మూడునెలల తర్వాత ఓ రోజు ఆఫీసులో ఉండగా అతని పార్ట్‌నర్ నుంచి ఫోన్ వచ్చింది.

"కొంపమునిగింది కృష్ణమూర్తిగారూ! స్థల సేకరణ జరగుతున్న చోట్ల ప్రజాప్రతిఘటన, ఆందోళన, ప్రతిపక్షాల విమర్శలకి తలఒగ్గి ప్రభుత్వం అక్కడ స్టీల్ ఫ్యాక్టరీ నెలకొల్పే ప్రయత్నాన్ని విరమించుకుంది. మన కొన్న స్థలాలరేట్లు బాగా తగ్గిపోయాయి. మనం ఉన్న ఫళంగా స్థలాలు అమ్మలేకపోతే పెట్టుబడి తిరిగి రావడం అనుమానమే. మీరు వెంటనే రండి'' అన్న అతని మాటలు విన్న కృష్ణమూర్తికి భూమి గిర్రున తిరిగినట్లయి కుర్చీలో కూలబడిపోయాడు. చేతిలోంచి రిసీవర్ జారిపోయింది. ముఖం తెల్లగా పాలిపోయింది.

అతని పరిస్థితిని చూసిన కొలీగ్స్ దగ్గరకి వచ్చి "ఏమైంది కృష్ణమూర్తీ?'' అని అడిగారు.

మళ్లీ అగాధంలోకి కూరుకుపోతున్న ఫీలింగ్ కలిగిన కృష్ణమూర్తికి చేసిన అప్పులు మేరు పర్వతంలా కనిపించి భవిష్యత్తు అంధకారంగా మారినట్లయింది. నోటమాటరాక రామారావునే చూస్తుండిపోయాడు కృష్ణమూర్తి.

★